నవతెలంగాణ

1

ఆదిలాబాద్

ఆదివారం | అక్టోబర్ 15, 2023 | www.navatelangana.com

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్రం ఆమోదించాలని ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరు సమ్మయ్య అన్నారు. శనివారం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయనను ఎమ్మార్పీఎస్, జాంబవ సేన మండల కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జంగం రవి, కె.ప్రభుదాస్, రాజేశం, కత్తెరపాక రవీందర్, మంద రాజేష్, ఎల్లయ్య ప్రశాంత్, రాహుల్, గంగారెడ్డి, సత్తన్న గంగన్న, ధర్మన్న, పోశం, వెంకటేష్, రాజు, మహేష్, ధర్మేందర్, సత్తన్న ప్రదీప్, గంగన్న పాల్గొన్నారు.



చిన్నారులకు వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలి

నవతెలంగాణ-నార్నూర్

చిన్నారులకు తల్లిదండ్రులు వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని హెల్త్ సూపర్వైజర్ చరణ్‌దాస్ సూచించారు. శనివారం మండలంలోని బేతల్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామంలో చిన్నారులకు వ్యాక్సిన్ వేయించారు. అనంతరం పిల్లలకు అందించిన వ్యాక్సిన్‌లు, అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను పరిశీలించారు. అంగన్వాడీ టీచర్‌తో కలిసి గర్భిణులకు గుడ్లు సరఫరా చేశారు. ఇంటింటా తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాపురావ్, మాన్కుబాయి, విమల, అంగన్వాడీ టీచర్ కవిత, రత్న, ఆశా విమలాబాయి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేగా పోటీకి అవకాశం ఇవ్వాలని వినతి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎంపీపీ



నవతెలంగాణ-జైపూర్

బీజేపీ జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ జాడి ఏసయ్య అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ స్థానం నుండి పోటీకి అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, ఎన్నికల కమిటీ సభ్యులు ఇంద్రసేనారెడ్డిని కలిసి దరఖాస్తు పెట్టుకున్నారు. మండలంలోని పౌనూర్‌కు చెందిన జాడి ఏసయ్య తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఎంపీపీగా ఉన్నారు. తదుపరి కాంగ్రెస్, టీఆర్ఎస్‌లో పనిచేసి ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నారు. నేతకాని సామాజిక వర్గానికి చెందిన ఆయన షెడ్యూల్ కులాలకు రిజర్వు చేయబడిన చెన్నూర్ నియోజకవర్గం నుండి పోటీకి అవకాశం కల్పించాలని బీజేపీ నాయకులను కోరారు. నియోజకవర్గంలో నేతకాని సామాజికవర్గం ఓట్లు అత్యధికంగా ఉన్నందున గెలుపు అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుదర్శన్, క్రిష్ణ ఉన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- గడ్చిరోలి ఎంపీ అశోక్ నేత



నవతెలంగాణ-కడెం

తెలంగాణతో పాటు నిర్మల్ జిల్లాలోని మూడు స్థానాల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహారాష్ట్ర గడ్చిరోలి ఎంపీ, జిల్లా సంఘటన ఇన్‌చార్జి అశోక్ నేత ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఖానాపూర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు స్థానాలను బీజేపీ గెలుపొందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఇటు రాష్ట్రం, అటూ కేంద్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువస్తాయన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తామే ఇస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వారం రోజుల్లో అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేయనుందన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో కలిసి పోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తేలని ప్రత్యర్థులు..ఊపందుకోని ప్రచారం..!

- పల్లెల్లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- టికెట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల ఎదురుచూపు
- నేడు కాంగ్రెస్ తొలి జాబితా ప్రకటించే అవకాశం
- సోషల్ మీడియా వేదికగా కొనసాగుతున్న వార్

అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థులు వెల్లడైనా..వీరికి ప్రత్యర్థులెవరో తేలడం లేదు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ప్రకటించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. దీంతో ప్రచార పర్వంలో ఇప్పటి వరకు బీఆర్ఎస్ అభ్యర్థులే ముందు వరుసలో ఉంటున్నారు. కాంగ్రెస్ ఆశావహులు మాత్రం ఆ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారెంటీలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. కానీ ప్రతి నియోజకవర్గంలో ఇద్దరు నుంచి నలుగురి వరకు టికెట్ కోసం పోటీ పడటంతో ఎవరికి దక్కుతుందో తెలియక ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ టికెట్లను దాదాపు ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆదివారం తొలి జాబితాను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క బీజేపీ కూడా టికెట్ల కేటాయింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. ఆ పార్టీ తరుపున ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరి నుంచి నలుగురి వరకు పోటీ పడుతుండగా.. ఎవరికి దక్కుతుందో తెలియక ఆ వర్గాల్లోనూ స్పష్టత లేకుండా పోయింది. మరోపక్క బీఎస్పీ, డీఎస్పీ పార్టీలు వారి అభ్యర్థులను ప్రకటించిన చోట్ల ప్రచారాన్ని ప్రారంభించాయి. మరోపక్క అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియా వేదికగా ప్రచారం.. విమర్శలు..ప్రతి విమర్శలతో రాజకీయాలను హీటెక్కిస్తున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమరం దగ్గర పడుతుండటంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ పార్టీ పది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. నెలరోజుల క్రితమే జాబితా వెల్లడించడంతో టికెట్ దక్కిన అభ్యర్థులు ప్రచారం పర్వంలో నిమగ్నమయ్యారు. పది అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు సిట్టింగ్‌లకు మరోసారి టికెట్ కేటాయించగా.. ముగ్గురు కొత్త అభ్యర్థులను బరిలో దింపుతోంది. ఇటీవల మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, మరో మంత్రి హరీష్‌రావు పర్యటించి శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. మరోపక్క అధికార పార్టీకి ధీటైన ప్రత్యర్థిగా భావిస్తున్న కాంగ్రెస్ మాత్రం టికెట్ల కేటాయింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. ఇటీవల ఆ పార్టీ మేనిఫెస్టో కమిటీ జిల్లాలో పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరించింది. కానీ అభ్యర్థులను ప్రకటించడంలో మాత్రం ఆలస్యం చేస్తోంది. ఇప్పటికే తొలి జాబితా సిద్ధమైందని ప్రచారం జరుగుతున్నా.. అధికారికంగా మాత్రం వెల్లడించడం లేదు. చివరి వరకు ఎవరికి టికెట్ దక్కుతుందో తెలియక పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ అయోమయం నెలకొంది. ఇప్పటికే పార్టీ అధిష్టానం వద్ద టికెట్ కోసం ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకట్రెండు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికలో పెద్దగా పోటీ లేకపోయినా..మిగితా చోట్ల మాత్రం అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తుందనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క బీజేపీ సైతం అభ్యర్థులను ప్రకటించడంలో ఆలస్యం చేయడం మూలంగా అధికార పార్టీ అభ్యర్థులకు ప్రత్యర్థులెవరో తెలియడం లేదు. మరో 45 రోజుల్లో ఎన్నికలు జరగనుండగా.. ఇప్పటికీ ఏ పార్టీ నుంచి ఎవరు పోటీలో ఉంటారో తెలియక జనాల్లోనూ అయోమయం కనిపిస్తోంది.

నేడు కాంగ్రెస్ తొలి జాబితా విడుదల..?

ఎన్నికలకు మరో నెలన్నర సమయం మాత్రమే ఉండటం.. ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థులు వెల్లడికావడంతో కాంగ్రెస్ సైతం ఆదివారం తొలి జాబితా వెల్లడించే అవకాశం ఉందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆ పార్టీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసిందని తెలిసింది. అభ్యర్థుల ప్రకటన ఇప్పటికే ఆలస్యం కావడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. తాజాగా నేడు తొలి జాబితా విడుదల చేస్తుందనే ప్రచారంతో ఆశావహుల్లో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరికి టికెట్ దక్కుతుందోనని ఆ పార్టీ వర్గాలతో పాటు ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది. ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరి నుంచి 11మంది వరకు దరఖాస్తులు చేయడం.. ఇందులో కీలకమైన అభ్యర్థులు ఇద్దరి నుంచి ముగ్గురి వరకు ఉండటంతో టికెట్ల కేటాయింపులో అధిష్టానం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో తీవ్రమైన కసరత్తులు చేస్తోందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో ఎన్ని స్థానాలు తొలి జాబితాలో ఉంటాయోనని సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

సోషల్ మీడియా వేదికగా వార్..!

రాజకీయ పార్టీల ప్రచారంలో సోషల్ మీడియా కీలకంగా మారింది. ఆయా పార్టీలు భౌతిక ప్రచారంతో పాటు సోషల్ మీడియా వేదికగానూ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఆ పార్టీ నాయకులు వారి అభ్యర్థులు..పార్టీల తరపున ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను జనాల్లోకి తీసుకెళ్తుండగా..ప్రతిపక్ష పార్టీలు వాటి వైఫల్యాలపై పోస్టులు పెడుతున్నాయి. ఇలా రాజకీయ పార్టీలు సోషల్ మీడియా వేదికగానూ ప్రచారాన్ని ముమ్మరం చేయడం రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి. ఎన్నికల నాటికి విమర్శలు..ప్రతి విమర్శలతో రాజకీయ వాతావరణం మరింత మారిపోనుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

గొర్రెల పంపిణీ పథకం అటకెక్కినట్టేనా.?

- జిల్లాలో 3వేల మంది లబ్ధిదారుల ఎదురుచూపులు

నవతెలంగాణ-హాజీపూర్

గొర్రెల పంపిణీ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. జిల్లాలో గొర్రెల పంపిణీ పథకానికి సుమారు 11వేల మంది గొల్లకుర్మ లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2018 సంవత్సరంలో పథకం ప్రారంభించారు. సుమారు 5500 మంది లబ్ధిదారులకు అందజేశారు. 3వేల మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా యాదవులకు అందలేదు. లబ్ధిదారులు రూ.43,750 చెల్లించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ యూనిట్‌లు అందలేదు. నిధుల లేమి, ప్రభుత్వం పథకం అమలులో శ్రద్ధ చూపక పోవడంతో పథకంపై ఆశ పెట్టుకున్న యాదవులకు నిరాశే మిగిలింది. అప్పుడు, ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తూ వచ్చిన ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించలేదు. యూనిట్‌కు రూ.లక్ష75వేలుగా నిర్ణయించి అందులో రూ.43,750 చెల్లించాలని షరతు విధించింది. పలువురు లబ్ధిదారులు చెల్లించిన గొర్రెలు అందలేదు. పథకం వర్తింపజేస్తారో లేదోనని యాదవులు ఆందోళన చెందుతున్నారు. పథకం ప్రారంభమై ఐదు ఎండ్లు గడుస్తున్న లబ్ధిదారులకు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ కరెంటును ప్రారంభించినట్లు విద్యుత్ శాఖ ఎస్సీ సంపత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గోసాయి ఉమర్ద, డెద్రా, మాన్కపూర్, గిరిజాయి, ఇంద్రానగర్, బద్దునాయక్ తండా తదితర గిరిజన గ్రామాలకు ఎస్టీఎస్డీఎఫ్ స్కీమ్ ద్వారా త్రీఫేజ్ కరెంట్ ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్సీ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈ గ్రామాలకు కొత్తగా 14.5 కేఎం, 11కేవీ లైన్‌ను కావర్డ్ కండక్టర్‌తో ఏర్పాటు చేయడం కోసం దాదాపు రూ.15కోట్లు ఎస్టీఎస్డీఎఫ్ స్కీమ్ ద్వారా ఖర్చు చేసి ఈ గ్రామాలకు త్రీఫేజ్ కరెంటును అందిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామల ప్రజలు, రైతులు త్రీఫేజ్ కరెంటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ ప్రభాకర్, ఏడీఈ సుబ్రమణ్యం, ఏఈ సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవళికది ప్రభుత్వ హత్యే

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నిరుద్యోగ యువతీ ప్రవళికది ప్రభుత్వ హత్యేనని నేషనలిస్ట్ స్టూడెంట్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పురేళ్ళ నితీష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగుల ఆత్మహత్యలకు కేసీఆర్ నిర్లక్ష్యపు వైఖరి కారణమని విమర్శించారు. వరంగల్ జిల్లా నర్సంపేటకి చెందిన ప్రవళిక గ్రూప్-2, టీఆర్టీ పరీక్షలు వాయిదా వేయడం వాళ్లే ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి కారణమైన విద్యార్థులని కేసీఆర్ విస్మరిస్తున్నారని ఆరోపించారు. ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉత్కంఠభరితంగా జోనల్ గేమ్స్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలో సిఓఈలో జరుగుతున్న 9వ జోనల్ స్థాయి జోన్-1 బాలుర క్రీడా పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. రెండవ రోజు మూడు రౌండ్ల క్రీడాంశాల్లో మొదటి రౌండ్ ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు నువ్వానేనా అన్నట్టు సాగాయి. సెమీఫైనల్స్‌కి చేరుకొని ఆదివారం జరగనున్న పోటీల వివరాలను ఇన్‌చార్జి దాసరి ప్రసాద్ తెలిపారు.

అండర్ 14విభాగంలో విజేతలు

క్యారమ్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా ఆసిఫాబాద్, ఏటూరునాగారం పొందాయి. చదరంగంలో మంథని, కోరుట్ల, కోటపల్లి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. షార్ట్‌పుట్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ వరుసగా కె.సంకేత్ (కాసిపేట), జె.వరుణ్‌సందేశ్ (జైపూర్), జె.సాయి కుమార్(ఆసిఫాబాద్)విద్యార్థులు కైవసం చేసుకున్నారు. డిస్కస్ త్రోలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ వరుసగా కె.సంకేత్(కాసిపేట),కె.మల్లిఖార్జున్(ఏటూరునాగారం),జె.రాగవార్(ఏటూరినాగారం)కుదక్కాయి. 200మీటర్స్ పరుగుపందెంలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ వరుసగా జె.వరుణ్ సందేశ్ (జైపూర్), జె.సాయికుమార్(ఆసిఫాబాద్), ఏ.సాగర్(సిర్పూర్-టి) పొందారు.



వాలీబాల్‌లో తలబడుతున్న క్రీడాకారులు

అండర్ 17 విభాగంలో..

షార్ట్‌పుట్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ వరుసగా ఆర్.విక్కి(ఆసిఫాబాద్), కె.శ్రీనాథ్(సిర్పూర్-టి), బి.రాహుల్(కోటపల్లి) చేజిక్కించుకోగా అండర్ 19లో షార్ట్‌పుట్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ వరుసగా డి.శ్యాం స ం ద ం (క ట ప లి), యల్.అభిలాష్(ఏటూరునాగారం),ఆర్.శివ(సిఓఈబెల్లంపల్లి)సాధించారు.సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. బతుకమ్మ వేడుకల్లో సీఈవో కొప్పుల స్వరూప రాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, గురుకులాల ప్రిన్సిపాల్స్ లలిత కుమారి, పి జ్యోతి, సంధ్యారాణి, స్వరూప, శ్రీనివాస్, వినోద్, ఊటూరి సంతోష్, సీనియర్ ఉపాధ్యాయులు మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



నవతెలంగాణ-జన్నారం

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని లక్షెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీష్ కోరారు. శనివారం మండలంలోని లోతరే, దేవునిగూడెం, కామన్‌పల్లి, కిష్టాపూర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా శాంతియుతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

రైతులకు వరప్రదాయిని ఆయిల్ పామ్ సాగు

- తోటల పెంపకంపై రైతుల ఆసక్తి
- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం



నవతెలంగాణ-తాండూర్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా ప్రభుత్వం ఉద్యానవన పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తుంది. ఒకే పంట కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలను వేయాలని ఉద్యానవన శాఖ ద్వారా అవగాహన కల్పిస్తూ సాగు చేసేల సహకారం అందిస్తున్నారు. అందులో భాగమే ఆయిల్ పామ్‌సాగు. జిల్లాలో ఆయిల్‌ఫామ్ తోటల పెంపకంపై రైతులు కూడా ముందుకు వస్తున్నారు. వాణిజ్య పంటల సాగు సరళిలో నూనె గింజల ఉత్పత్తి కోసం ప్రభుత్వం రైతులకు ఆయిల్ పామ్ పంటలపై ప్రోత్సాహకాలను అందిస్తోంది. సబ్సిడీపై మొక్కలను అందించడం నుంచి మొదలుకొని మార్కెట్ పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో రైతులు ఆయిల్ ఫామ్ పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. మంచిర్యాల జిల్లాలోని భీమారం, చెన్నూర్, బెల్లంపల్లి ఉద్యానవన శాఖ క్లస్టర్‌లోని మండలాల్లో 2310 ఎకరాల్లో 500 మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారు. మందమర్రి మండలం శంకరపల్లిలో రూ. 500కోట్లు, నిర్మల్ జిల్లాలో రూ.250కోట్లతో ఆయిల్ ఫామ్ పరిశ్రమల ఏర్పాటుకు ఇటీవల మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయడంతో రైతులు ఆయిల్ ఫామ్ తోటలపై మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. బహు వార్షిక పంటల విధానంలో ఒకసారి నాటిన ఆయిల్ ఫామ్ తోటలు 30 సంవత్సరాల వరకు దిగుబడులను అందిస్తాయి. నాటిన నాలుగో సంవత్సరం నుండి పంట రావడం మొదలవుతుంది. తోటల్లో చీడపీడల బెడద ఉండదు.

తోటల పెంపకానికి ప్రభుత్వ సబ్సిడీ

ప్రభుత్వం నూనె గింజల పంటలను ప్రోత్సహించేందుకు ఆయిల్ పామ్ తోటల పెంపకానికి సబ్సిడీలను అందిస్తోంది. 90 శాతం సబ్సిడీతో రైతులకు ఆయిల్ ఫాం మొక్కలను పంపిణీ చేస్తుంది. మొక్క ధర రూ.193 కాగా ప్రభుత్వం రూ.173 సబ్సిడీ అందిస్తుంది. కేవలం 20 రూపాయలు చెల్లించి రైతులు ఆయిల్ మొక్కలను పొందవచ్చు. దీంతో పాటు సబ్సిడీ ద్వారా డ్రిప్ స్పింక్లర్ పైపులను 90 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తోంది.

ఆయిల్ ఫామ్ తోటలో అంతర్ పంటలు

ఆయిల్ ఫామ్ తోటల్లో రైతులు అంతరపంటలు వేసి నిర్వాహణ ఖర్చులను పూడ్చుకోవడమే కాకుండా లాభాలను ఆర్జించవచ్చు. మొక్కకు మొక్క 9 మీటర్ల ఉంటుంది. మొక్కలకు మధ్య ఎడంలో అంతర పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. తోటల్లో అంతర్ పంటలుగా పత్తి, బొప్పాయి సాగు చేసుకోవచ్చు తక్కువ విస్తీర్ణంలో ఆయిల్ ఫాన్స్ చేసే రైతులు అంతర్ పంటలుగా టమాట, వంగ, బెండ పంటలు వేసి లాభాన్ని పొందవచ్చు.



శాఖ ద్వారా ప్రోత్సాహానందిస్తున్నాం : సుప్రజ, ఉద్యానవన శాఖ అధికారి, బెల్లంపల్లి



ఆయిల్ ఫామ్ తోటల వైపు రైతులు ఆసక్తి పెంచేల శాఖ తరపున ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. సబ్సిడీ, మార్కెటింగ్ తదితర వాటి గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. మొక్కల నిర్వహణ ఖర్చులు, అంతర పంటలు వేసేందుకు సంవత్సరానికి రూ. 4200లను అందిస్తున్నాం. రైతుల ఆయిల్ ఫామ్ తోటలను పర్యవేక్షిస్తూ పెంపకంలో మెలకువలు, సలహాలు, సూచనలను తెలియజేస్తున్నాం. ప్రభుత్వం స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నాం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | అక్టోబర్ 15, 2023 | www.navatelangana.com

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కొర్టికల్ గ్రామంలో శనివారం రీజనల్ డైరెక్టర్ ఆదేశం మేరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని డాక్టర్, ఫార్మిస్ట్ బి మహేందర్, మెడికల్ ఆఫీసర్ గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల దృష్ట్యా గ్రామాల్లో వైరల్ ఫీవర్ చర్మవ్యాధులు ఇతర వ్యాధులు వ్యాపిస్తున్న సందర్భంగా వాటిని అరికట్టడానికి ఈ శిబిరాలను అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆత్రం నగేష్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీయూ సెట్ పీజీ ఎంట్రెన్స్ టాపర్

నవతెలంగాణ-తాంసి

సీయూ సెట్ పీజీ ఎంట్రన్స్‌లో టాపర్‌గా మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుని కుమారుడు జింక రుషియేంద్ర పీజీ ఎంట్రన్స్‌లో టాప్ స్కోర్ చేసి ఇండియాలోనే ప్రతిష్టాత్మకమైన ఆర్కియాలజీ కాలేజ్ దక్కన్ కాలేజ్ పూణేలో సీటు సంపాదించడం జరిగింది. సీటు సాధించిన సందర్భంగా విద్యార్థున్ని అదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆర్ట్స్ ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల సిబ్బంది సత్కరించి అభినందించారు.



యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-భైంసా

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సేవాలాల్ మహారాజ్ బోధనలకు అనుగుణంగా నడుచుకోవాలని గంగేశ్వర్ మహారాజ్ అన్నారు. శనివారం బంజారాల గురువు సేవాలాల్ దిండి పాదయాత్ర కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావు పటేల్ స్వాగతం పలికారు. పాదయాత్ర కుభీర్ మండలంలోని మర్లగొండ గాలిసింగ్ తండా నుంచి బాసర అమ్మవారి క్షేత్రం వరకు కొనసాగనుందని అన్నారు. మార్గం మధ్యలో భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో విడిది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ బోధనలకు అనుగుణంగా నడుచుకోవాలని గంగేశ్వర్ మహారాజ్ సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, పెద్దలు సూచించిన మార్గంలో నడవాలన్నారు. భక్తితోనే ఐక్యత భావం పెంపొందుతుందన్నారు. భక్తులకు పవార్ రామారావు పటేల్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ బి.గంగాధర్, నాయకులు వెంగల్‌రావ్, హస్గుల్ సర్పంచ్ ప్రకాష్ పటేల్, మాజీ సర్పంచ్ చక్రధర్ పటేల్, నాయకులు సతీష్‌రెడ్డి, కోర్వ శ్రీకాంత్ ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి ఉచిత వైద్యం



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబామైన గుగ్గిల్ల సరస్వతి గత ఆరు నెలలుగా ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతుంది. వివిధ హాస్పిటల్లో పరీక్షలు చేయగా ప్రయివేట్ కార్పొరేట్ హాస్పిటల్ చికిత్స చేసుకోవాలని డాక్టర్లు తెలపడంతో చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇంట్లోనే ఉండిపోయింది. శనివారం మండల ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ వన్నెల అశోక్ బాధిత రోగి ఇంటికి వెళ్లి రిపొట్స్ చూసి తనవంతుగా రోగిని మంచిర్యాలలోని ఒక కార్పొరేట్ హాస్పిటల్ ఊపిరి తిత్తుల అన్నీ పరీక్షలు నిర్వహించి మందులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వన్నెల అశోక్ మాట్లాడుతూ గత ఏన్నో సంవత్సరాలుగా బోథ్ నియోజక వర్గంలోనీ అన్ని మారుమూల గ్రామాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు అర్థోఫెడిక్ వ్యాధి గ్రస్తులకు సర్జరీలు చేయడం జరిగిందని అన్నారు. గుగ్గిళ్ళ సరస్వతి ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకొని ట్రస్టు అధ్వర్యంలో అన్ని రకాల పరీక్షలు చేయించడంతోపాటు మందులను అందించడం జరిగిందన్నారు. డాక్టరుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని రైతుల ఆందోళన



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక సబ్ స్టేషన్ వద్ద బోథ్ మండల కేంద్రానికి చెందిన రైతులు 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించాలని శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సరైన సమయంలో వర్షాలు పడక పెట్టిన పెట్టుబడికి దిగుబడి రాక ఆందోళన చెందుతున్న రైతులకు ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి కనీసం 12 గంటలకు కూడా సరిగా ఇవ్వడం లేదని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటికైనా అధికారులు 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రమేష్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఉద్యమకారుడి రాజీనామా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ఉద్యమకారుడు రామోజీ ఆంజనేయులు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పాల్గొన్న తనను సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న చిన్నచూపు చూశారన్నారు. తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా మానసికక్షోభకు గురిచేశారన్నారు. 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి సంక్షేమ పథకాలు దరిచేరలేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సైతం విస్మరించారని ఆరోపించారు. త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో ఉద్యమకారులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అసలైన అర్హులకు సంక్షేమ ఫలాలు దక్కకుండాపోయాయన్నారు. అందుకే బీఆర్ఎస్ వైఖరిని ఖండిస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు.

ముత్నూర్‌లో దుర్గాదేవి స్థాపన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఆదివారం దుర్గాదేవి స్థాపన చేయనున్నట్టు సర్పంచ్ తుమ్రం భాగుబాయి మారుతి తెలిపారు. ఈ నెల 15 నుంచి 24 వరకు తొమ్మిది రోజుల పాటు దేవి ఉత్సవం ఉంటుందని, ఈ సందర్భంగా చుట్టు పక్క గ్రామాల ప్రజలు ప్రతి రోజు కాలినడకన చేరుకుంటారన్నారు. భక్తులకు ప్రతి రోజు గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు.

ఫ్లెక్సీల ముద్రణకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్
- ఫ్లెక్సీ, ప్రిటింగ్ ప్రెస్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రచార సామగ్రి, ఫ్లెక్సీల ముద్రణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లెక్సీ, ప్రిటింగ్ ప్రెస్ ప్రతినిధులతో ఆయన వేరువేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనుమతిలేని ప్రచార సామాగ్రి, ఫ్లెక్సీలను ప్రచురిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ప్రింటింగ్ చేయించే కరపత్రాలు, గోడప్రతులు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామాగ్రికి జిల్లా ఎన్నికల అధికారి అనుమతి పొందాలని, అనుమతి లేకుండా ముద్రిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రచురణాలపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

ఎన్నికల ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి...

రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అన్నారు. ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని అన్నారు. దేవాలయాలు, చార్జీలు, మసీదులు, ఇతర ప్రార్థన ప్రదేశాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని, నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల ప్రచారం కొరకు గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు వంటి వాటికీ, సభలు, సమావేశాలు, వాహన ర్యాలీలకు సంబంధిత రిటర్నింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. అలాగే దినపత్రికలు, వివిధ న్యూస్ ఛానల్స్, సోషల్ మీడియాలో ప్రకటనలకై మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ ద్వారా అనుమతుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపయోగించే వివిధ వస్తువులు, సామాగ్రికి రేట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి నిర్ణయించారు. సమావేశాలలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఫ్లెక్సీ, ప్రిటింగ్ ప్రెస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్ అందుబాటులో ఉండటం లేదంటూ ఆందోళన

- సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-ఖానాపూర్

సర్పంచ్ అందుబాటులో ఉండటం లేదంటూ ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామపంచాయతీ ప్రజలు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. శనివారం గ్రామస్తులు భూమగౌడ్, శ్రీనివాస్, అశోక్, సాయి, నర్సయ్య, పలువురు కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. వరంగల్‌లో ఉండి ఇక్కడి ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అందుబాటులో ఉండకుండా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని అన్నారు. సర్పంచ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామసభలు నిర్వహించకుండా గృహలక్ష్మి లబ్ధిదారులను ఇష్టారాజ్యంగా ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం గ్రామంలో వీధి దీపాలు కూడా సరిగా లేని పరిస్థితి నెలకొందన్నారు. ఓవైపు సర్పంచ్ స్థానికంగా ఉండకపోగా మరోవైపు పంచాయతీ కార్యదర్శిని సైతం ఇన్‌చార్జిగా నియమించారన్నారు. దీంతో గ్రామంలో ఏ సమస్య వచ్చినా గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి కేవలం మల్టీపర్పస్ వర్కర్లకు మాత్రమే చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో సైతం సర్పంచ్ ఇస్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. గ్రామంలో సీసీ రోడ్ల పనులలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. స్థానికంగా ఉండని, సమస్యలు పట్టించుకోని, సర్పంచ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి బాసర క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు

- 15 నుంచి అక్టోబర్ 23 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపిన ఆలయ ఈఓ



నవతెలంగాణ-బాసర

బాసర సరస్వతిదేవి ఆలయంలో ఈనెల 15 నుంచి అక్టోబర్-23 వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈఓ విజయరామరావు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయంలో కొలువైన అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక, అర్చన, మంగళ వాయిద్య సుప్రభాత సేవలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఉదయం 9 గంటలకు ఆలయ సన్నిధిలో విశ్వేశ్వర పూజ, క్షేత్ర పూజ , కలశ స్థాపన ఘటస్థాపనతో ఉత్సవాలను ఆరంభిస్తారు.

ఆలయ సన్నిధిలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఒక్కో రోజు ఒక్కో రూపంతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధానార్చకులు సంజీవ్ పూజారి తెలిపారు. ప్రత్యేకంగా తయారు చేసిన మండపంలో అమ్మవారి రూపాలను ఆలయ అర్చకులు నెలకొల్పుతారని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు. అక్టోబర్ 20న అమ్మ వారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం శుభ ముహూర్తాన్ని పురస్కరించుకొని అధిక సంఖ్యలో చిన్నారులకు అక్షర అభ్యాస పూజలు జరిపించడానికి భక్తులు వేలాదిగా తరలివస్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సన్నిధిలో ప్రత్యేక దర్శన అక్షరాభ్యాస పూజ, క్యూలైన్ ఏర్పాటు పూర్తి చేసినట్లు ఈఓ తెలిపారు. అక్టోబర్ 20న అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం శుభ ముహూర్తం సందర్భంగా ఆలయం తరపున చిన్నారులకు ఉచితంగా పాలు, బిస్కెట్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను దేవాదాయశాఖ తరపున అందించునున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం బయో టాయిలెట్స్, బేబీ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దేవి నవరాత్రులు సందర్భంగా నాందేడ్ బాబాజీ జగదీష్ మహరాజ్ భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ చేయనున్నారని తెలిపారు. గోదావరి నది తీరం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పోలీస్ సిబ్బంది భక్తులకు సేవలు అందించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఆలయ ఏఈఓ సుదర్శన్ గౌడ్, సూపరింటెండెంట్ సంజీవ్‌రావు, పీఆర్ఓ విలాస్ పాల్గొన్నారు.

విద్యార్థి విద్యా సంస్థల్లో బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ముందస్తు బతుకమ్మ సంబురాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. మహిళలంతా ఒక్క చోట చేరి, రంగు రంగుల పూలతో బతుకమ్మలను ముస్తాబు చేసి సాంప్రదాయ రీతిలో వేడుకలను జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే పలు పాఠశాలలు, కళాశాలల్లోనూ బతుకమ్మ వేడుకలను సంబురంగా నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రి వేడుకలతో పాటు బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకునన్నారు. శనివారం మావలలోని విద్యార్థి విద్యా సంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను కన్నులపండవగా నిర్వహించారు.



విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్క పువ్వులతో అందంగా బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి పాటలకు అనుగుణంగా కోలాటాలు, నృత్యాలు చేశారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి హాజరై విద్యార్థినులతో కలిసి ఆడి పాడారు.

బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని తెలియచెప్పేలా వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

కలిసికట్టుగా పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

- ఎమ్మెల్సీ దండె విఠల్



నవతెలంగాణ-ఉట్నూర్

పార్టీ నాయకులు అందరూ కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థిని ఈ ఎన్నికల్లో గెలిపించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జీ దండె విఠల్ అన్నారు. మండల నాయకులు, పార్టీ కార్యకర్తల సమావేశం స్థానిక పంక్షన్ నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్‌లతో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి గ్రూపు రాజకీయాలు చేయకుండా అందరూ కలిసి కట్టుగా సీఎం కేసీఆర్ ప్రకటించిన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని భారీ మెజారితో గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

మద్యానికి బానిసై చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని బొర్రా గణేష్ కాలనీ చెందిన మేకల రాములు శనివారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందుల కారణంగా మేకల రాములు(45) బాసర చెరువులో దూకినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

రాజా రావణ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 24న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ, దళిత, బహుజన ప్రతినిధి అయినటువంటి రాజా రావణ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ హక్కు పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో తుడుందెబ్బ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గత పాలకులు రాజా రావణ్ చరిత్రను పూర్తిగా వక్రీకరించారని, ఆయన మనుగడ లేకుండా చేశారని ఆరోపించారు. ఈ నెల 24న స్థానిక కొమురంభీంకాలనీలో నిర్వహించే వర్ధంతి కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ఈ వర్ధంతిని జరపాలన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేథావులు, కార్మికులు, కర్షకులు తరలివచ్చి జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత తరుణంలో మెజార్టీ ప్రజలను విచ్చినం చేయడానికి, అణచివేయడానికి కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. అందరూ చైతన్యవంతం కావాలని, ఈ కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కంది సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జోగు రామన్నను చిత్తు చిత్తుగా ఓడించేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించి మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని వార్డు నెంబర్ 7, 8 కేఆర్‌కే కాలనీతోపాటు శాంతినగర్, మహాలక్ష్మీవాడ, క్రాంతినగర్, తాటిగూడ, సంజయ్‌నగర్ కాలనీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో సోనియా గాంధీ ఇచ్చిన 6 గ్యారంటీ హామీలను పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. మరో 45 రోజుల్లో ఎమ్మెల్యే జోగు రామన్న పీడ విరుగుడు అవుతుందని జోస్యం చెప్పారు. నాలుగు సార్లు గెలిపిస్తే ప్రజలకు ఏంచేయలేదని మండిపడ్డారు. తమ వార్డులకు వచ్చినప్పుడు నిలదీసి అడగాలని పిలుపునిచ్చారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మెన్ షెడ్మకి ఆనంద్‌రావు, నాయకులు ఐనేని సంతోష్‌రావు, డేరా కృష్ణారెడ్డి, ఎంఎ షకీల్, కొండూరి రవి, సయ్యద్ సుజాత్ అలీ, అల్లూరి నారాయణరెడ్డి, రాజ్ మహమ్మద్, లోక భాస్కర్‌రెడ్డి, కాటిపెల్లి ఊషారెడ్డి, దర్శనాల చంటి ఉన్నారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
కుమురంభీం
ఆసిఫాబాద్-మంచిర్యాల
ఆదివారం | అక్టోబర్ 15, 2023 | www.navatelangana.com

గని పని స్థలాల పరిశీలన

మందమర్రి: కేకే-5 ఇన్‌క్లైన్ గని, బ్యాంక్ హెడ్ పని స్థలాలను జీఎం మనోహర్ తనిఖీ చేశారు. శనివారం పని స్థలాలను పరిశీలిస్తు వివరాలను తెలుసుకున్నారు. ఉద్యోగుల భద్రత, సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మైనింగ్ కార్యకలాపాలు, వివిధ అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మైనింగ్ కార్యకలాపాలు, భద్రత ఉత్పత్తి, ఇతర అంశాలు అత్యున్నతస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పరిష్కార మార్గాలపై చర్చించారు. రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యంగా అందరూ సమిష్టి కృషితో అంకిత భావంతో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, కేకే-5 గని మేనేజర్ భూశంకరయ్య, రాంప్రసాద్, సీహెచ్ రమేష్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ మోసం చేసింది : ఎమ్మెల్యే రేఖానాయక్

నవతెలంగాణ-జన్నారం

పదేళ్లుగా పార్టీలో ఉంటు ఖానాపూర్ ప్రాంత అభివృద్ధి చేశానని, కానీ అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్టు ఇవ్వకుండా బీఆర్ఎస్ మోసం చేసిందని ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్ అన్నారు. శనివారం ఏఆర్ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో తనకున్న ఆదరణతో మరోసారి ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే తాను పోటీలో తను ఉంటానని స్పష్టం చేశారు. ప్రజలు మరోసా సారి సహకరిస్తు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యం సతీష్, మౌలానా మున్ను, సర్పంచ్ గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.



ఘనంగా బౌద్ధ దమ్మ దీక్ష దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ బౌద్ధ దమ్మ దీక్ష స్వీకరించిన రోజున పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఘనంగా బౌద్ధ దమ్మ దీక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించి, పంచశీల జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ తాడిత పీడిత వర్గాలను అభివృద్ధి చేసే క్రమంలో అన్ని వర్గాలను ఒకే రకంగా చూడాలని బౌద్ధ దీక్షను అంబేద్కర్ నాగపూర్‌లో తీసుకున్నారని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని కులమతాలకు అతీతంగా ఉండే సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ దుర్గే, హెూక్టుజీ దుర్గే, కృష్ణజీ జాడే, చరణ్ మసాదే, పెంటయ్య చంద్రి, వసంత్‌రావు చూనార్కర్, ఎండి ఆసిఫ్, గోవర్ధన్ కాంబ్లె, లింగయ్య చంద్రి, హసద్ బాయ్, పుల్లయ్య, సాంబయ్య ముంజం, మనోహర్ ముంజం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేశ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

బీసీ సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్ బౌద్ధ దమ్మ దీక్షను పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేయడంతో పాటు పాలాభిషేకం చేశారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. విగ్రహాన్ని శుభ్రం చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు.

కోల్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్, క్లీనర్స్ సమ్మె వాయిదా



నవతెలంగాణ - రెబ్బెన

కనీస వేతనం డ్రైవర్లకు రూ.32 వేలు, క్లీనర్లకు రూ.18 వేలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని దినాలు కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ సౌకర్యం, అలాగే ప్రతినెల 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, సమ్మె కాలుపు వేతనాలు చెల్లించాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, క్లీనర్లు రెండు రోజుల నుండి చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. శనివారం ట్రాన్స్‌పోర్టు యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో వారంతా కూడా సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. ఈ నెల 29న చర్చలు ఉంటాయని తెలిపారు. చర్చల్లో కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, క్లీనర్ల యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు అరికిల్ల స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె గౌస్, ఉపాధ్యక్షుడు తిరుపతి, లచ్చన్న, రవి, ప్రతాప్, జాయింట్ సెక్రటరీ సాగర్, కృష్ణగోపాల్, కోశాధికారి సత్యనారాయణ, ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం తరపున ప్రవీన్‌రావు, జితేందర్‌రావు, రత్నాకర్‌రావు, బంక ప్రశాంత్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు



ఆసిఫాబాద్‌లో బతుకమ్మతో చిన్నారులు

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. మహిళలకు ఎంతో ఇష్టమైన బతుకమ్మ పండుగ సంబరాలు మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభం కాగా మహిళలంతా భాజాభజంత్రీల మధ్య సమీప వాగుల నుండి ఇసుకను తీసుకొచ్చి గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం తమతమ ఇండ్ల నుండి బతుకమ్మను తీసుకొచ్చి ఆడిపాడారు. బతుకమ్మ వేడుకలతో ఊరూవాడలన్నీ అంబరాన్నంటాయి. ఆయా గ్రామాల్లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తొలి ఓటరు ఊరు..అభివృద్ధిలో ఆఖరు..!

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్ నియోజకవర్గం మారుమూల వెనుకబడ్డ నియోజకవర్గం. కానీ ఓటరు జాబితా, ఎన్నికల ప్రక్రియలో మాత్రం ఈ నియోజకవర్గం ముందు వరుసలో నిలుస్తోంది. తెలంగాణలో 119 నియోజకవర్గాలు ఉండగా ప్రతి నియోజకవర్గానికి ఒక వరుస సంఖ్య ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు సిర్పూర్ నియోజకవర్గం వరుస సంఖ్య 246. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన తరువాత ఇది తెలంగాణలోని నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఇక, ఈ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామంలో తొలి పోలింగ్ స్టేషన్ ఉంది. ఇదే గ్రామానికి చెందిన ఆత్రం రంభబాయి తెలంగాణ రాష్ట్ర ఓటరు జాబితాలో తొలి ఓటరుగా గుర్తింపు పొందారు.

అభివృద్ధిలో ఆఖరు

ఎన్నికల లెక్కల్లో ముందు వరుసలో ఉన్న మాలిని గ్రామం అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలోనే ఉండిపోయింది. కాగజ్‌నగర్‌కు ఈ గ్రామం 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. మాలిని గ్రామం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే 40కిలో మీటర్ల దూరం ప్రయాణించాలి. అది కూడా సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా వెళ్లాలి. అయితే ఈ ఊరికి సరైన రోడ్డు, రవాణా సౌకర్యం సైతం లేదు. ఈ ఊరి గిరిజనం ఆర్టీసీ పల్లె వెలుగు బస్సును కూడా ఎరుగరు. ప్రభుత్వం అందరికీ అందించామని చెప్పుకుంటున్న మిషన్ భగీరథ నీళ్లను ఈ గ్రామం ఇప్పటికీ రుచి చూడలేదు. ఇప్పటికీ బావి, బోరు నీరు తాగాల్సిందే. ప్రపంచమంతా 5జీ, ఏఐ టెక్నాలజీలో అడుగుపెట్టినా ఇక్కడి సెల్ టవర్‌కు ఒక పాయింట్ సిగ్నల్ కూడా ఉండదు. అర్ధరాత్రి ఆపదొస్తే 108 వాహనం కూడా రాదు. బైక్‌లు, ఆటోల్లో కనీసం 20కిలో మీటర్లు వెళ్తే కానీ వైద్యం అందని దుస్థితి. దేవుడా నీవే దిక్కు అనుకొని గిరిజనులు తమ బతుకు సాగిస్తున్నారు. ఈ గ్రామ జనాభా 600. ఓటర్లు 430 మంది ఉండగా ఇందులో స్త్రీలు 222, పురుషులు 208 మంది ఉన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ నిస్వార్థంగా ఓటు వినియోగించుకుంటున్నారు.

ఎన్నికలప్పుడే వస్తరు..: ఆత్రం రంభబాయి, రాష్ట్ర తొలి ఓటరు, మాలిని



ఎన్నికలప్పుడే మా ఊరికి అధికారులు, నాయకులు వస్తరు. ఆ తర్వాత మా బాగోగులు ఎవరూ పట్టించుకోరు. మా ఊరికి కనీసం ఫోన్ సిగ్నల్ సైతం లేని పరిస్థితి ఉందంటే ఏ స్థితిలో మా జీవనం సాగుతుందో అర్థం చేసుకోండి. నీటి సౌకర్యం నుంచి రవాణా సౌకర్యం దాకా అన్నింటికీ తిప్పలే.





కాంగ్రెస్ నాయకుల్లో టెన్షన్ టెన్షన్

- డీసీసీ గెలిచేనా? స్ట్రాటజీ కమిటీ గెలిచేనా?
- నేటితో తెరపడనుందా? ఇంకా కొనసాగనుందా?
- నేడు 58మందితో తొలి జాబితా విడుదల







నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో నాయకులు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇప్పటికే అధికార పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించగా ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ ప్రజా సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని చెబుతూ దానికి అనుగుణంగా సర్వేలు చేయించారు. కాంగ్రెస్ సర్వేలు పూర్తి చేసుకుని మొదటి విడతగా నేడు 58 మందితో మొదటి జాబితా ప్రకటించనున్న నేపథ్యంలో జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు చోటు లభిస్తుందా లేదా అనేది సర్వత్రా టెన్షన్ వాతావరణం నెలకొంది. జిల్లాలో రెండు నియోజకవర్గాలు ఉండగా ఆసిఫాబాద్‌లో సరస్వతి, రాథోడ్ గణేష్, అజ్మీర శ్యాంనాయక్ పోటీ పడుతున్నారు. కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ముగ్గురు నాయకులు పోటీ పడుతున్నారు. ఎవరికి వారు తమకు టికెట్ వస్తుందని చెబుతూ ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు మొదటి విడతలో ప్రకటించే 58 మందిలో జిల్లాలోని నియోజకవర్గాలకు అభ్యర్థులను ఫైనల్ చేస్తారో లేదోనని నాయకుల్లో టెన్షన్ నెలకొంది.

డీసీసీ గెలిచేనా? స్ట్రాటజీ కమిటీ గెలిచేనా?

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి మొదటి నుండి మర్సుకోలా సరస్వతిని తర్వాత శ్యాంనాయక్ రాకతో ఇద్దరికీ మద్దతు పలుకుతూ వస్తున్నారు. కాంగ్రెస్ స్ట్రాటజీ కమిటీ చైర్మన్ ప్రేమ్‌సాగర్ రావు రాథోడ్ గణేష్‌ను అభ్యర్థిగా నిలబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ఇరువురి మధ్య బట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా జిల్లా కేంద్రంలో అభ్యర్థిత్వంపై పెద్ద మొత్తంలో గొడవ జరగడంతో పాటు గణేష్‌కు టికెట్ ఇప్పించడంతోపాటు గెలిపిస్తానని ప్రేమ్‌సాగర్‌రావు స్టేజి మీదనే సవాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. నేడు ప్రకటించే నియోజకవర్గాల్లో ఆసిఫాబాద్ ఉంటే ఎవరి మాట నెగ్గుతుందనేదానిపై కార్యకర్తల్లో చర్చ ప్రారంభమైంది.

నేటితో తెరపడనుందా? ఇంకా కొనసాగనుందా?

కొంతకాలంగా సర్వేలు చేయించిన కాంగ్రెస్ మొదటి లిస్టు నేడు విడుదల చేయనున్న నేపథ్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో టెన్షన్‌కు తెరపడనుందా ఇంకా కొనసాగనుందా అనేది తెలియనుంది. పార్టీకి సంబంధించిన కార్యకర్తలు మూడు గ్రూపులుగా ఏర్పడి కొంతమంది సరస్వతి, కొంతమంది శ్యామ్‌నాయక్, మరికొంతమంది రాథోడ్ గణేష్‌తో ప్రచారంలో పాల్గొంటున్నారు. ముగ్గురు కూడా తమకే టికెట్ వస్తుందనడంతో కార్యకర్తలు కూడా ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఏదేమైనా కాంగ్రెస్ పార్టీ వ్యూహంతో నియోజకవర్గంలో ముగ్గురు నాయకులు చేసిన ప్రచారంతో టికెట్ల కేటాయింపు పూర్తికాకముందే ఒక విడత ప్రచారం ముగిసినట్లయ్యిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఉపాధి కల్పించడంలో మోడీ ప్రభుత్వం విఫలం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధి కల్పించడంలో కేంద్రాల్లోని మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అఖిల భారత యువజన సమైక్య జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడంలో విఫలమైందన్నారు. దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని యువజన సంఘం ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దుర్గం రవీందర్, ఉపాధ్యక్షులుగా బావునే వికాస్, కుదురుపాక మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఆత్మకురి చిరంజీవి, సహాయ కార్యదర్శులుగా ఎండి.రహీం, రాకేష్, కోశాధికారిగా కస్తూరి రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా గోనె గణేష్, మొహర్లే శ్రీకాంత్, పుదరి సాయి, బాలు నాయక్, చంద్రశేఖర్, పవన్ కళ్యాణ్, రాజులను ఎన్నుకున్నారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- పట్టించుకోని అధికార యంత్రాంగం



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గోలేటి సీహెచ్‌పీ సమీపంలో ఉన్న రాళ్లవాగు నుండి అక్రమంగా ఇసుకను తవ్వుతూ కొందరు ఇసుక బకాసురులు సొమ్ము చేసుకుంటున్నారు. నదీ ప్రాంతంలో ఉన్న ఇసుకతో పాటు మొరాన్ని అడ్డూ అదుపు లేకుండా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో ఇదే అదునుగా భావించి అక్రమ ఆర్జనకు పాల్పడుతున్నారు. సందిట్లో సడేమియాగా ఓవైపు సెలవు రోజులు, మరోవైపు ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఇదే అదునుగా చేసుకొని అక్రమార్కులు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటుచేసి జేసీబీ సాయంతో ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతోనే అక్రమార్కులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ ఇసుక రవాణాకు కొంత మంది అధికారులు సహకారం అందిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాగులు, వంకల నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వానికి లక్షల రూపాయల ఆదాయం గండికొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఇసుక బకాసురులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ స్థాయికి గోలేటి క్రీడాకారులు

నవతెలంగాణ - రెబ్బెన





42వ జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ బాలబాలికల పోటీలు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాయిలో ఈ నెల 15 నుండి 19 వరకు జరగనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ నుండి కుమురం భీం జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన షార్ప్‌స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు చెందిన బాలబాలికలు ప్రేమ్‌జిత్, కుమ్మరి శ్రీస్ఫూర్తి కారుణ్య ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన బాలబాలికలను ఉమ్మడి ఆదిలాబాద్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగం, జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సహాయ కార్యదర్శి ఎస్ తిరుపతి, షార్ప్‌స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ మహేందర్, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి ఒప్పులేటి శంకర్, జిల్లా సద్గాకార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె భాస్కర్, జిల్లా చతక్‌తప్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు ఆర్ రామకృష్ణారెడ్డి, కుమ్మరి మల్లేష్, హరిలాల్, మల్లేష్, చందర్ అభినందనలు తెలిపారు.

త్వరలో ఉమ్మడి జిల్లాలో వారాహి యాత్ర



నవతెలంగాణ-జన్నారం

త్వరలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారాహి యాత్ర ప్రారంభం అవుతుందని జన సేన నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ నరేందర్ నాయక్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ వరాహి యాత్రను ప్రారంభమవుతుందన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయం నుంచి వరాహియాత్రను చేపడుతామని, దీనికి జనసేన అధినేత పవణ్‌కళ్యాణ్ వస్తారని తెలిపారు. యాత్ర ఖానాపూర్, కడెం, జన్నారం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో సాగుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో పర్యటిస్తు బీఆర్ఎస్ వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి తాను పోటీలో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రంజిత్ కుమార్, రవిచంద్ర, సాకేత్, సంతోష్, ప్రశాంత్, శ్రీనాథ్, నరేష్ పాల్గొన్నారు.

వడ్డెరలకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డెర కులస్తులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు బొంతల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బొంతల గోపి, అధ్యక్షులుగా బొంతల లక్ష్మణ్ ఉపాధ్యక్షులుగా కుంట మహేష్ ప్రధాన కార్యదర్శిగా బొంతల రాజు, కోశాధికారిగా దండ కృష్ణ, గౌరవ సలహాదారులుగా ఎల్లయ్య కిషోర్ ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 ఏండ్లు అవుతున్న ఇప్పటికి వడ్డెరలకు రాజకీయంగా ఏ పార్టీ ప్రాధాన్యత ఇవ్వాలేదన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదగాలంటే ప్రతి పార్టీ ఎమ్మెల్యే టికెట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దహెగాం



భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఐనం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఐనం గ్రామానికి చెందిన కంబాల మల్లేష్(32), మమత భార్యభర్తలు కొన్ని రోజులుగా మల్లేష్ తాగుడుకు బానిసయ్యాడు. రాఖీ పౌర్ణమి రోజు భార్య తన కొడుకు శ్రీకాంత్‌తో కలిసి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. తరచుగా మల్లేష్ అత్తవారి ఇంటికెళ్లి భార్యను ఇంటికి రమ్మని పిలిచాడు. తాగుడు మానేస్తే వస్తానని చెప్పి ఇంటికి పంపించేది. దీంతో తన భార్య ఇక రాదేమోనని మనస్తాపం చెంది తాగిన మైకంలో శుక్రవారం సాయంత్రం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు దహెగాం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుండి బెల్లంపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని తండ్రి బానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గస్థాయి సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ టీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు భూక్య గోవింద నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు, ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై నియోజకవర్గంలో రెండు విడతలుగా నిర్వహించే పాదయాత్ర పై చర్చిస్తామన్నారు. కార్యకర్తలు నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కోసాయి గ్రామానికి చెందిన టేకం లక్ష్మీబాయి ఇల్లు శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... టేకం లక్ష్మీబాయి ఎప్పటిలాగా కూతురుతో కలిసి చేనులోకి కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయింది. ఇంటితో పాటు నిత్యావసర సరకులు, బట్టలు, దుప్పట్లు కాలిబూడిదయ్యాయి. గమనించిన గ్రామస్తులు మంటలు అదుపులోకి తెచ్చినప్పటికీ అప్పటికే పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది. సాయంత్రం



తల్లికూతుళ్లు ఇంటికి వచ్చిచూసి బోరున విలపించారు. తల్లికూతుళ్లు వితంతువులు కావడంతో మగవారి సహాయం లేక కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గ్రామస్తులు వారి పరిస్థితి చూసి భోజనాలు ఏర్పాటు చేశారు. మండల అధికారులు నాయకులు ఇల్లు నిర్మించి, కనీస సదుపాయాలు కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

నవతెలంగాణ-జన్నారం

అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కలమడుగు, ఇందన్‌పల్లి గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఆయన పరిశీలించారు. వాహనాలను తనిఖీ చేస్తు సిబ్బందికి పలు సూచనలు చేశారు. మద్యం, డబ్బులు రవాణా ఎక్కువ జరిగే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వాహనదారులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీష్ పోలీసులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీల

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఆన్‌లైన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీల నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు వెబ్‌సైట్ ద్వారా వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ఉంటాయన్నారు. 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ స్థాయి వరకు విద్యార్థులు సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సాంకేతిక పరిజ్ఞాన వినియోగం అనే అంశంపై అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. అదేవిధంగా డిగ్రీ ఆ పై స్థాయి విద్యార్థులు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై పోటీలుంటాయన్నారు. ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి జిల్లాలో బహుమతుల ప్రధానం చేసి, రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సంపాదించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

వైఎస్సార్‌టీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు

నవతెలంగాణ-ఖానాపూర్

నియోజకవర్గం వైయస్సార్‌టీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా లోకిని రాములు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షులు లోక లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీని చూశామని, కానీ ఖానాపూర్ ఎక్కడ అభివృద్ధి చెందాలేదన్నారు. ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,బీసీలు ఏకతాటి పైకి వచ్చి వైస్ షర్మిలకు మద్దతుగా నిలవాలని కోరారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్థిక పరిస్థితి బాగా లేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. పట్టణంలోని చించర్‌వాడకు చెందిన పులి గణేష్(60) కూరగాయల వ్యాపారం చేసుకుంటూ తన జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెంది శనివారం మావల హరితవనం మొదటి గేటు ముందర చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా శని అమవాస్యను పురస్కరించుకుని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా శని దేవాలయాలకు భక్తులు పోటెత్తగా భక్తి శ్రద్ధాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రోజు అమవాస్య కలిసి రావడంతో పట్టణంలోని శని దేవాలయంలో నల్ల నువ్వులు, నూనెతో తైలాభిషేకం చేశారు. దోషాలు తొలిగిపోవాలని కోరుతూ ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం పట్టణంలోని వినాయక్ చౌక్‌లో పురాతనకాలం నాటి శని దేవాలయంలో వేకువజాము నుండే భక్తులు తరలివచ్చారు. ఉదయం నాలుగు గంటల నుండే భక్తుల తాకిడి ప్రారంభమైంది. శనివారం రోజు అమవాస్య కలిసిరావడంతో ప్రత్యేకంగా భావించిన భక్తులు పూజలు చేసి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఆలయ కమిటి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. ఆలయ ప్రాంగణం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

వేతనాలు చెల్లించలేని దుస్థితిలో కేసీఆర్ ప్రభుత్వం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో కేసీఆర్ ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపడుతున్న సమ్మె శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని దేశ, విదేశాలలో ప్రచారం చేసుకుంటున్న కేటీఆర్ తాను మంత్రిగా కొనసాగుతున్న శాఖలో కార్మికులు వేతనాల కోసం రోడ్డెక్కారని, దీనికి ఆయన ఏం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. వెంటనే కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, సంజీవ్‌తో పాటు కార్మికులు, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన పాత్రికేయులు

నవతెలంగాణ-మందమర్రి

జర్నలిస్టులపై ఎమ్మెల్యే సుమన్ చేసిన వ్యాఖ్యలను జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. 13న మందమర్రి పట్టణం 2వ జోన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో చెన్నూరు ఎమ్మెల్యే సుమన్ జర్నలిస్టులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జిలు ధరించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వీరి నిరసనకు టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి సంజయ్ కుమార్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కన్వీనర్ మొయ్య రాంబాబు, రిటైర్డ్ టీచర్ ఎండీ ఇబ్రహీం, సీనియర్ పాత్రికేయులు పార్వతి రాజేష్ మద్దతు తెలిపారు. మందమర్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ మాట్లాడుతూ బాల్క సుమన్ బేషరతుగా జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్నికల ప్రచార వార్తలను నిషేధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సతీష్, రవి, తాండ్ర శ్రీనివాస్, కుడిపూడి శ్రీనివాస్, అనిల్, నవీన్, అనిల్ భగత్, వేణు గోపాల్, మణిరాజ్, సత్యనారాయణ పాత్రికేయులు పాల్గొన్నారు.

రూ.50 వేల అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-తాంసి



అనుమతి లేని మహారాష్ట్ర మద్యంతో పాటు బెల్ట్ షాపుల్లో అమ్ముతున్న మద్యన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. భీంపూర్ మండలంలోని అందర్‌బంద్, గోమూత్రి గ్రామాల్లో ఎస్సై లాల్‌సింగ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మద్యం అమ్ముతున్నరన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి రూ. 50 వేల మద్యం పట్టుకున్నారు. ఎస్సై లాల్‌సింగ్ మాట్లాడుతూ అందర్‌బంద్ గ్రామానికి చెందిన దుర్వాబుడి రామ్ సురేఖ, గోమూత్రి గ్రామానికి చెందిన సచిన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల దృష్ట్యా మండలంలో బెల్ట్ షాప్‌లో మద్యం అమ్మకాలు నిలిపి వేయడం జరిగిందన్నారు. ఎవరైనా గ్రామాల్లో మద్యం అమ్ముతున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ నరేష్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు

ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతి ప్రవళిక ఆత్మహత్య చేసుకోలేదని, ఆమెది ప్రభుత్వ హత్యేనని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్‌సీ పోటీ పరీక్షల కోసం రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్న ప్రవళిక పరీక్షల వాయిదాతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాలతో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. లక్షల మంది నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికలలో గద్దె దించాలని కోరారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో ఇక్కడి నుండి తరలించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ఏడారిగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని మండిపడ్డారు. తుమ్మిడిహేటి ప్రాజెక్టును పూర్తి చేయడంలో కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదని అన్నారు. కాంట్రాక్టుల్లో కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టును ఇక్కడి నుండి తరలించారని ఆరోపించారు. సిర్పూరు అసెంబ్లీ స్థానం నుండి బీఎస్పీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా మహిళా కన్వీనర్ సిడాం జ్యోతి, అసెంబ్లీ అధ్యక్షులు డోకె రాజన్న, నాయకులు షబ్బీర్ హుస్సేన్, ముస్తఫీజ్ హుస్సేన్, తన్నీరు పోచం, నక్క మనోహర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : గ్రూపు-2 పరీక్ష వాయిదా పడిందని మనస్థాపానికి గురై హైదరాబాద్ అశోక్ నగర్‌లో ప్రైవేట్ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోని చనిపోయిన నిరుద్యోగ విద్యార్థినీ ప్రవళిక ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) కుమురం భీం జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ ఆరోపించారు. రాష్ట్రంలో గత సంవత్సర కాలంలో 8వ నిరుద్యోగుల ఆత్మహత్య అన్నారు. సరైన ప్రణాళిక లేకుండా రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ వ్యవరిస్తుందన్నారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని, నిరుద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ నిలుస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు.

పోరాడితే ఫలితం సాధించడం తథ్యం

- సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోరాడితే ఫలితం సాధించడం తథ్యమని సీఐటీయూ జిల్లా నాయకుడు, హాస్టల్ డైలీ వైస్ అవుట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ డైలీ వైస్ అవుట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆడే శ్యామ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డైలీ వైస్ వర్కర్లు నాలుగు రోజులు సమ్మె చేసిన నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ పెండింగ్ వేతనాలు విడుదల చేస్తూ జీఓ విడుదల చేసిందన్నారు. పోరాటం చేస్తే ఫలితం తప్పకుండా వస్తుందన్నారు. భవిష్యత్తులో ఇదే పోరాట స్ఫూర్తితో పెండింగ్ సమస్యలు పరిష్కరించే విధంగా హాస్టల్ వర్కర్లు ఐకమత్యంతో పోరాటం చేయాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ. కోటి 9లక్షల 93వేల519 బడ్జెట్ నిధులు విడుదలయ్యాయని తెలిపారు. రాబోయే దసరా పండుగను దృష్టిలో పెట్టుకుని నిధులు విడుదల చేసిన గిరిజన సంక్షేమ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, జిల్లా నాయకులు మాంకు, బాలకిషన్, సంపత్, జాటోత్ ప్రేమ్ దాస్ పాల్గొన్నారు.

మొదటిరోజు ఘనంగా బతుకమ్మ పండుగ ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగ మొదటి రోజు జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మగా పూజిస్తారు. ప్రపంచంలో ప్రకృతిని పూజించే పూలను ఆరాధించే గొప్ప సంస్కృతి కలిగిన తెలంగాణలో మొదటి రోజు అంబరాన్ని అంటేలా వేడుకలు జరిగాయి. జిల్లా కేంద్రంలోని బాపునగర్‌లో శారద గణేష్ మండల్ వద్ద చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. వాసవి మందిర్‌లో వైశ్య మహిళలు బతుకమ్మ వేడుకల్లో ఆడిపాడారు. టీఆర్ నగర్, సందీప్ నగర్, దస్నాపూర్, జనకాపూర్, రాజంపేట, పైకాజి నగర్‌లతో పాటు పలు కాలనీల్లో బతుకమ్మ వేడుకలు జరిగాయి.

కాసిపేట : మండలంలో ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సోమగూడెం భరత్ కాలనీ, కాసిపేట, దేవాపూర్, కొండాపూర్ యాప, దుబ్బగూడెం, మల్కెపల్లి, ధర్మరావుపేట, ముత్యంపల్లి, సోనాపూర్, కోనూర్, పెద్దనపల్లి, కొమటిచేను, పల్లంగూడ తదితర గ్రామాల్లో ఎంగిలిపూలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే మగవారు పూల సేకరించి ఇంటికి తీసుకురాగా మహిళలు ప్రత్యేక పూజలు చేసి గుమ్మడి, తంగెడి, గునుగు, బంతితో పాటు పలు రకాల పువ్వులతో బతుకమ్మలను అందంగా పేర్చారు.

అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలతో ఆటలాడి మొదటి రోజు ఎంగిలిపూలతో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.



కాసిపేటలో..

సీఎం కేసీఆర్‌తోనే కారుణ్య నియామకాలు

- టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్



నవతెలంగాణ-కాసిపేట

సీఎం కేసీఆర్ వల్లనే సింగరేణిలో కారుణ్య నియామకాలు సాధ్యమయ్యాయని, ఈ సారి మళ్ళీ బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడపల్లి సంపత్ అన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సింగరేణిలో 20 వేలకు పైగా నూతన ఉద్యోగాలను కారుణ్యం ద్వారా ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ఆదివాసీలకు అవకాశం కల్పించారన్నారు. సింగరేణి కార్మికుల వల్ల ఈ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారానే సింగరేణిలో కారుణ్య నియామకాల సాధన జరిగిందని, ప్రభుత్వం చేసిన మేలుకు ప్రతి రూపంగా కార్మికల సోదరులు చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్ కుమార్, మైనింగ్ ఇంఛార్జి పెంద్రి రాజిరెడ్డి, కాసిపేట-2 గని ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ సెగ్గం శ్రీనివాస్, ఓర్మెన్ చారి, గుమాస తిరుపతి, గోపాల కృష్ణ, రాజేందర్, సారంగపాణి, చింతం రవి, కిరణ్, శివ, అశోక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే జోగు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృ వియోగం చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగురామన్న శనివారం ఆయనను కలిసి పరామర్శించారు. వేముల తల్లి మంజులమ్మ ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తనువు చాలించారు. శనివారం మంత్రి స్వగ్రామమైన వేల్పూర్ గ్రామానికి ఎమ్మెల్యే వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంజులమ్మ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మంత్రిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉన్నారు.



సర్‌సిల్క్ కాలనీలో చోరీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో చోరీ జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం వివరాలు... ఈ నెల 12న విశ్రాంత ఉద్యోగురాలు పద్మ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు ఆ తాళాన్ని పగులగొట్టి ఇంట్లోని బీరువాలను ధ్వంసం చేశారు. అందులోని రెండు తులాల బంగారు నగలు, రూ.10వేల నగదు, ఎనిమిది తులాల వెండి ఆభరణాలను అపహరించారు. శనివారం ఇంటికి వచ్చి చూడగా తలుపుల తాళలు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించించారు. టౌన్ ఎస్సై బి. స్వామి ఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బతుకమ్మ నిర్వహణపై సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయంలో శనివారం సద్దుల బతుకమ్మ నిర్వహణపై ఎస్‌ఓటూ జీఎం మచ్చగిరి నరేందర్ సీనియర్ సేవా సభ్యులతో సమావేశం నిర్వహించారు. బతుకమ్మ పండుగ సంబంధించిన ఏర్పాట్లు, వసతుల కల్పన తదితర వాటిపై సేవా సభ్యుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ పండుగ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, సీనియర్ సేవా సభ్యులు కుందారపు శంకరమ్మ సొల్లు లక్ష్మి, రూప, బోయిన శంకరమ్మ పాల్గొన్నారు.

గంజాయి, మట్కా నిర్వాహకులు అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో సీసీఎస్ సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో శనివారం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద గంజాయి అమ్ముతున్న తాటిగూడకు చెందిన దుమట్టి సాయికుమార్‌ను పట్టుకొని అతని వద్ద నుండి 39 చిన్న ప్యాకెట్లలో 100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. ఎండు గంజాయిని మహారాష్ట్ర కిన్వట్ నుండి తీసుకొని వస్తున్నట్లు విచారణలో తెలిసిందని సీఐ సాయినాథ్ తెలిపారు. అదే విధంగా ఖుర్షీద్ నగర్‌లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని 8 దేశిధారు మందు బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. అదే కాలనీలో మట్కా నిర్వహిస్తున్న యునుస్‌ను పట్టుకొని రూ.2,530 నగదు, మట్కా చీటిలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు.

ధమ్మచక్ర పరివర్తన దివస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దమ్మచక్ర పరివర్తన దివస్‌ను భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహంపై పూలవర్షం కురిపిస్తూ బౌద్ధ భిక్షువులు, భారతీయ బౌద్ధమహాసభ సభ్యులు ఘన నివాళులర్పించారు. బౌద్ధ వందన సమర్పించారు. బౌద్ధ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో ఆవిర్భవించిన మతాలు ప్రపంచ చరిత్ర భవితవ్యాన్ని మార్గనిర్దేశం చేశాయన్నారు. ఇవీ తమ ఆధునిక, విప్లవాత్మక భావాలతో అప్పటి వరకున్న సామాజిక కట్టుబాట్లను, వ్యత్యాసాలను తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. ఆ సమయంలోనే గౌతమ బుద్ధుడు ఆచరణీయ విలువలను ప్రబోధించే బౌద్ధ మతాన్ని స్థాపించి ప్రజల్లో తాత్విక ఆలోచనలను పెంపొందించడానికి విశేషంగా కృషి చేశారన్నారు.

సింగరేణి ఉద్యోగులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శనివారం(డబ్ల్యూపీఎస్అండ్‌జీఏ) 90వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా నియర్‌బై వాలీబాల్ పోటీలను ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. సింగరేణి ఉద్యోగులంతా ఒకే కుటుంబంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారన్నారు. మందమర్రి, బెల్లంపల్లి ఏరియా జట్ల మధ్య జరిగిన పోటీలో మందమర్రి జట్టు గెలుపొందిందని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు ఉత్పత్తితో పాటు క్రీడల్లో రాణించి కోలిండియా స్థాయిలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుండి బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల ప్రత్యేకత తిరుమల తిరుపతి దేవస్థానంలో మొదటగా జరుగుతాయి. తర్వాత రాష్ట్రంలో రెండోస్థానంలో జరిగే ఏకైక ఆలయం సిర్పూర్ వెంకటేశ్వర స్వామి ఆలయం. ఇక్కడ ప్రతిరోజు వాహన సేవా నిర్వహించడం జరుగుతుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో కళ్యాణ రథోత్సవం, దసరా పండుగ రోజున రాంలీల, శని పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొంటారు.

నేడు తెలంగాణ పెన్షనర్ల సదస్సు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మంచిర్యాలలోని తెలంగాణ పెన్షనర్స్ రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్ల సదస్సును హరిత ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకట్ స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి హాజరవుతారని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పల్లెపల్లెకు తెలంగాణ జన సమితి

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో శనివారం పల్లె పల్లెకు తెలంగాణ జన సమితి కార్యక్రమాన్ని టీజేఎస్ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని ఓని, సురెల్లి, కౌఠ, సావర్గాం, బిదిరెల్లి, టాక్లి, గ్రామాల్లో పర్యటించి, తెలంగాణ జన సమితి ప్రచురించిన కరపత్రాలను రచ్చ బండల వద్ద ప్రజలకు అందజేసి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న తీరును తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసి రామ్ వివరించారు. రాబోవు ఎన్నికల్లో తెలంగాణ జన సమితిని బలపర్చలని కోరారు. తెలంగాణ జన సమితి మండల అధ్యక్షులు రాజు, శ్రీనివాస్ గోకుల్, ఫాదర్, రాములు, మీనాజ్ పాల్గొన్నారు